సాక్షి
ప్రకాశం
మంగళవారం : 21 : మే : 2024



పేట రౌడీలపై ఖాకీ ప్రేమ

ఎన్నికల వేళ దర్శి నియోజకవర్గంలో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసిన నరసరావుపేట నుంచి వచ్చిన రౌడీ మూకలపై పోలీసులు ఉదాసీనంగా ఉన్నారు. - 8లో..



మధురం మాటున విషం

మామిడి పండ్లను హోల్‌సేల్ వ్యాపారులు కృత్రిమంగా పండిస్తున్నారు. వీటి వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయి. - 10లో..

గరిష్టం/కనిష్టం
36/29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గెలుపు వైఎస్సార్ సీపీదే

- అసత్య ప్రచారాలు నమ్మవద్దు..
- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి



ఒంగోలు సెంట్రల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. అసత్య ప్రచారాలు నమ్మవద్దని, రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ విశ్వాసంతో ఓటు వేశారని కొంత మంది పనిగట్టుకుని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని చెప్పారు. తాను ఒంగోలులో మంచి మెజార్టీతో గెలుస్తానని, రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ 125 పైగా స్థానాలు కైవసం చేసుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పచ్చమీడియా అసత్య ప్రచారాలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

25 వరకు డీఈఎల్ఈడీ పరీక్ష ఫీజు గడువు

ఒంగోలు: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ 2022–24 బ్యాచ్ (డీఈఎల్ఈడీ) నాలుగో సెమిస్టర్ పరీక్షలు జూన్‌లో నిర్వహిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు హాజరుకాదలచిన విద్యార్థులు రూ.50 అపరాధ రుసుముతో ఈనెల 25వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు.

స్ట్రాంగ్ రూములు పరిశీలించిన కలెక్టర్



పరిశీలన అనంతరం రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎన్నికల పోలింగ్ పూర్తయిన తర్వాత భద్రపరిచిన రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్ రూములను సోమవారం కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. ఒంగోలు పార్లమెంట్‌తో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంల స్ట్రాంగ్ రూముల తలుపులకు వేసిన సీళ్లు, భద్రతా చర్యలను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. పరిశీలన అనంతరం రిజిస్టర్‌లో సంతకం చేశారు.

అణువణువూ తనిఖీ..

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ రోజు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చెలరేగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమైంది. జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం నాయకులు అధికార పార్టీ నేతలపై దాడులకు తెగబడ్డారు. అప్పటికప్పుడు పరిస్థితిని పోలీసులు అదుపులోనికి తీసుకొచ్చారు. ఓట్ల లెక్కింపులోపు గొడవలు జరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుండడంతో జిల్లాలో అసాంఘిక శక్తులపై నిఘా ఉంచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు ముందస్తు చర్యలకు ఉపక్రమించారు. ఒకవైపు ఒంగోలు నగరంతో పాటు కనిగిరి పట్టణంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. మరో వైపు అనుమానిత వ్యక్తులను గుర్తించేందుకు సోమవారం జిల్లా అంతటా కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కొత్త వ్యక్తుల గురించి ఆరా తీశారు. ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు.

- అసాంఘిక శక్తులపై నిఘా
- జిల్లా అంతటా జల్లెడ పట్టిన పోలీసులు
- ఓట్ల లెక్కింపు సందర్భంగా గొడవలు జరగకుండా చర్యలు
- కార్డన్ సెర్చ్‌తో వణుకు
- పలు గ్రామాలు, కాలనీల్లో పెద్ద ఎత్తున తనిఖీలు
- ఎలాంటి ధ్రువపత్రాలు లేని 193 వాహనాలు సీజ్



కనిగిరిలోని పామూరు బస్టాండ్ సెంటర్‌లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ నెల 13వ తేదీన పోలింగ్ జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో పలు నియోజకవర్గాల్లో గొడవలు జరిగాయి. ఎన్నికల సందర్భంగా కొత్త వ్యక్తులను తరలించి నగరంలో గొడవలు సృష్టించేందుకు తెలుగుదేశం పార్టీ ప్రయత్నిస్తున్నట్లు పోలింగ్‌కు ముందే ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన అనుమానించినట్టే పోలింగ్ రోజున తెలుగుదేశం పార్టీ నేతలు వెంగముక్కల పాలెంలో, నగరంలోని ఉమా మహేశ్వర కాలేజీ సమీపంలో గొడవలకు దిగారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసుల చేతిలోని లాఠీ లాక్కొని మరీ దాడులకు పాల్పడ్డారు. అలాగే దర్శి నియోజకవర్గంలో పల్నాడు జిల్లా నరసరావుపేట నుంచి తరలించిన రౌడీలతో ఘర్షణలు సృష్టించి పలువురి మీద దాడులు చేశారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పుల్లలచెరువు మండలంలో ఏకంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ మీద రాళ్లతో దాడి చేశారు. అప్రమత్తమైన పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారు. గతంలో ఎన్నడూ దర్శి, యర్రగొండపాలెంలో ఇలాంటి ఘర్షణలు జరిగిన దాఖలాలు లేవు. ఓటమి భయంతో ఉన్న టీడీపీ ఓట్ల లెక్కింపు తరువాత కూడా గొడవలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో శాంతి భద్రతలను కాపాడేందుకు, నేరాలను అరికట్టేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. మాక్ డ్రిల్స్‌తో అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. సోమవారం జిల్లా వ్యాప్తంగా కార్డన్‌సెర్చ్ పేరుతో తనిఖీలు చేసింది.

వణుకు పుట్టించిన కార్డన్ సెర్చ్...

ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా వ్యాప్తంగా పోలీసు యంత్రాంగం నిర్వహించిన కార్డన్ సెర్చ్ కొత్త వ్యక్తులు, అనుమానితుల గుండెల్లో వణుకు పుట్టించింది. జిల్లా కేంద్రమైన ఒంగోలుతో పాటుగా సింగరాయకొండ, చీమకుర్తి, నాగులుప్పలపాడు, దర్శి, పొదిలి, త్రిపురాంతకం, పీసీపల్లి, సీఎస్‌పురం, మర్రిపూడి, మార్కాపురం, కంభం, గిద్దలూరు, కొమరోలు, పుల్లలచెరువు, టంగుటూరు తదితర పోలీసు స్టేషన్ల పరిధిలో ఉదయం ఐదు గంటల నుంచే తనిఖీలు ప్రారంభించారు. ఇందులో భాగంగా గ్రామాలు, కాలనీల్లో పోలీసు అధికారులు, సిబ్బంది కలిసి జల్లెడపట్టారు. గ్రామ శివారు ప్రాంతాలు, ముఖ్యమైన కూడళ్లు, పాత నేరస్తుల నివాసాలు, మద్యం, గుట్కా, గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం ఉన్న దుకాణాలతో సహా చివరికి గడ్డివాములను కూడా వదిలిపెట్టకుండా తనిఖీలు చేయడం సంచలనం సృష్టించింది. పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న సమాచారం తెలుసుకున్న కొందరు పాత నేరస్తులు, ఓట్ల లెక్కింపు తరువాత గొడవలు సృష్టించాలని కుట్రలు చేస్తున్న టీడీపీ నాయకులు పరారీ అయినట్టు తెలిసింది. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకూ తనిఖీలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. కొత్త వ్యక్తులు, అనుమానితుల సంచారంపై ఎప్పటికప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను అప్రమత్తం చేశారు.

మాక్ డ్రిల్‌తో ప్రజల అప్రమత్తం:

ఓట్ల లెక్కింపు తరువాత గొడవలు జరిగే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ పోలీసు యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నారు. ఆదివారం ఒంగోలు నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద, సోమవారం కనిగిరి పట్టణంలోని పామూరు రోడ్డు జంక్షన్‌లో పోలీసు సిబ్బందితో మాబ్ ఆపరేషన్ నిర్వహించారు. ఒకవేళ ఏదైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే సకాలంలో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులతో పాటుగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే 10 ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. అల్లరి మూకల గురించిన సమాచారం తెలిసిన వారు 100కు కానీ, 112 కానీ ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు.

అల్లర్లు జరగకుండా జాగ్రత్తలు



ఎన్నికల లెక్కింపు సందర్భంగా కానీ ఆ తరవాత ఎలాంటి అల్లర్లు జరగకుండా అన్నీ రకాల ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. క్షేత్ర స్థాయిలో పోలీస్ అధికారులు పల్లెనిద్ర చేస్తూ ప్రజలతో మమేకం అవుతున్నారు. మాబ్ ఆపరేషన్, కార్డన్ సెర్చ్ లాంటివి చేపడుతూ ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. గ్రామ స్థాయిలోని ద్వితీయ శ్రేణి రాజకీయ నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. అయినా ఎవరైనా అల్లర్లకు, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. అలాంటి వారి మీద రౌడీ షీట్ ఓపెన్ చేస్తాం.

– గరుడ్ సుమిత్ సునీల్, ఎస్పీ



సింగరాయకొండలో సీజ్ చేసిన బైకులతో సీఐ, పోలీసు సిబ్బంది

గుర్తింపు పత్రాలు లేని 193 బైకులు స్వాధీనం

పోలీసుల తనిఖీల్లో ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని 193 మోటారు బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఒక్క ఒంగోలు నగరంలోనే 50కి పైగా వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక ఆటో కూడా సీజ్ చేశారు. ఈ వాహనాలు ఎక్కడ నుంచి వచ్చాయి. ఎక్కడ కొనుగోలు చేశారు. ఎవరు విక్రయించారు. దొంగతనానికి గురైన వాహనాలు ఏమైనా ఉన్నాయా అనేది పోలీసులు విచారణ చేసిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా సోమవారం రాత్రి 11 గంటల తరువాత కూడా నైట్ ఆపరేషన్ కూడా నిర్వహించినట్టు ఒంగోలు డీఎస్పీ కిశోర్ కుమార్ తెలిపారు.



మార్కాపురంలో సీజ్ చేసిన వాహనాలను చూపుతున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు

ప్రకాశం పంతులు స్ఫూర్తి ఆదర్శనీయం

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: టంగుటూరి ప్రకాశం పంతులు ఎంతో ఆదర్శనీయులని, ఆయన స్ఫూర్తితో జిల్లాను అన్నీ విధాలా అభివృద్ధి చేసేలా కృషి చేస్తానని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో ఉన్న ఆంధ్రకేసరి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాట యోధునిగా, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పరిపాలనలో ప్రకాశంపంతులు తనదైన ముద్ర వేశారని కీర్తించారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. దీనిలో ప్రకాశం పంతులు మునిమనుమడు టంగుటూరి సంతోష్‌కుమార్ కార్యక్రమం న్విహించిన యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

వినోదరాయునిపాలెంలో



ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



వినోదరాయునిపాలెంలో ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్థానికులు

నాగులుప్పలపాడు: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులుకు ఆయన స్వగ్రామం మండలంలోని వినోదరాయునిపాలెంలో గ్రామాభ్యుదయ సంస్థ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ప్రకాశం పంతులు 67వ వర్ధంతి సందర్భంగా సోమవారం గ్రామంలోని ప్రకాశం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామాభ్యుదయ సంస్థ చైర్మన్ భైరపనేని సూర్యనారాయణ మాట్లాడుతూ మహనీయుడు ప్రకాశం పంతులు జన్మించిన వినోదరాయునిపాలేనికి చరిత్రలో గౌరవనీయమైన చోటు లభించిందని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రిగా పని చేసినా కడదాకా నిరాడంబరంగా జీవించారని, నిస్వార్థంతో తన యావదాస్తిని దేశం కోసం ఖర్చు చేశారని తెలిపారు. నేటి తరం రాజకీయ నాయకులు, అధికారులు ప్రకాశం పంతులు జీవితాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని గ్రామ స్వరాజ్య సాధన సమితి అధ్యక్షుడు జి.వీరభద్రాచారి కోరారు. కార్యక్రమంలో విద్యావేత్త ఉన్నం చంద్రరావు, చల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిలో కాయ్ రాజా కాయ్..!

- కొత్తగా ఏర్పాటయ్యే ప్రభుత్వంపై, అభ్యర్థుల గెలుపు, మెజార్టీపై జోరుగా బెట్టింగులు
- ఐపీఎల్ తరహాలో మూడు నాలుగు అంశాలపై బెట్టింగులు

కనిగిరి రూరల్: కనిగిరిలో బెట్టింగ్ రాయుళ్లకు పండగొచ్చింది. ఎన్నికల ఫలితాలపై ప్రజల్లో ఉన్న ఆసక్తిని తెలివిగా కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. ఐపీఎల్ తరహాలో ఎన్నికల ఫలితాలలో కొత్తగా ఏర్పాటయ్యే ప్రభుత్వం, అభ్యర్థుల విజయం, వారికి వచ్చే మెజార్టీ, 110 సీట్లకుపైగా ఏ పార్టీకి వస్తాయి.? ఇలా.. రకరకాలుగా బెట్టింగ్ రాయుళ్లు అనేక కోణాల్లో బెట్టింగులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో అందరి దృష్టి కనిగిరివైపే ఉండటంతో అభ్యర్థుల గెలుపోటములపైనా బెట్టింగులు పెడుతున్నారు. పెరిగిన ఓటింగ్ శాతంతో వైఎస్సార్ సీపీ కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ విజయ అవకాశాలపై అంచనాలు పెరిగాయి. మహిళలు, ముస్లిం మైనార్టీలు, వృద్ధులు ఎక్కువ మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దద్దాల నారాయణ సుమారు 10 నుంచి 12 వేల ఓట్ల మెజార్టీతో గెలిచే అవకాశాలున్నట్లు సీనియర్ రాజకీయ నేతలు, విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దీంతో వైఎస్సార్ సీపీ గెలుపుపై



బెట్టింగులు ఊపందుకున్నాయి.

ఎవరి సర్వేలు వారివి...

రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటుతో పాటు కనిగిరిలో రెండోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమని విశ్లేషకులు చెబుతున్నారు. బెట్టింగ్ రాయుళ్లు సైతం వ్యక్తిగతంగా, ప్రత్యేక సర్వేల ద్వారా, ఆయా పార్టీల్లోని సీనియర్ నాయకులతో ప్రత్యేకంగా చర్చిస్తూ అంచనాలు వేసుకుంటూ బెట్టింగులకు దిగుతున్నారు. టీ స్టాల్స్, హోటల్స్, బడ్డీ బంకులు, కూల్ డ్రింక్ పాయింట్ల వద్ద ఎక్కడ చూసినా.. బెట్టింగులపై జోరుగా చర్చ జరుగుతోంది. మూడునాలుగు కోణాల్లో బెట్టింగులు వేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటుపై కొందరు, 110 సీట్లకుపైగా గెలుపుపై మరికొందరు, కనిగిరి గెలుపు, నియోజకవర్గ మెజార్టీ, కనిగిరి మున్సిపాలిటీ, మండలాల వారీగా మెజార్టీ.. ఇలా ప్రతి అంశంపై బెట్టింగ్ జరుగుతోంది.

సీఎం స్పందనతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో పెరిగిన జోష్...

వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల పోలింగ్ సరళిపై తొలిసారిగా గత గురువారం స్పందించి మళ్లీ చరిత్ర సృష్టిస్తున్నాం.. అని చెప్పడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. అప్పటి వరకు ప్రభుత్వం ఏర్పాటుపై జోరుగా బెట్టింగ్ కాసిన టీడీపీ శ్రేణులు, ఒక సామాజికవర్గం వారు ఒక్కసారిగా మెత్తబడ్డారు. ఒకటికి ఒకటిగా బెట్టింగ్ చేసిన వారు గత శుక్రవారం నుంచి 60కి 40 అంటూ మెత్తబడ్డారు. బెట్టింగ్ కట్టే అసలు వ్యక్తులు బహిరంగ మార్కెట్‌లో ఉండకుండా.. మధ్యవర్తులకు 2 శాతం కమీషన్ ఇస్తూ బెట్టింగ్ కాస్తున్నారు.

నియోజకవర్గంలో రూ.కోట్లలో బెట్టింగ్ జరుగుతోంది. ఎక్కువగా కనిగిరి, పామూరు పట్టణాల్లో ఎక్కడ చూసినా.. ఎన్నికల బెట్టింగ్‌ల పైనే చర్చ సాగుతోంది. వైఎస్సార్ సీపీ, టీడీపీ శ్రేణులు వారి అభ్యర్థుల గెలుపుపై ఎవరి అంచనాలు వారు వేసుకుంటూ బెట్టింగ్ బరిలోకి దిగుతున్నారు. ఈ క్రమంలో జూన్ 4న కౌంటింగ్ రోజు నాటికి బెట్టింగ్‌ల స్థాయి మరింత పెరిగే అవకాశం ఉంది. రౌండ్ల వారీగా మెజార్టీపై కూడా బెట్టింగ్ కాసేందుకు పలువురు సిద్ధంగా ఉండటం కొసమెరుపు.

సత్తాచాటిన బల్లికురవ ఎడ్లజత



పందెపురాయిని లాగుతున్న ప్రథమస్థానంలో నిలిచిన ఎడ్లజత



బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని రామాపురంలో పట్టాభిరామస్వామి, గ్రామ దేవత పేరంటాళ్ల తిరునాళ్ల సందర్భంగా గ్రామానికి చెందిన నారా వీరారెడ్డి, సిద్దమ్మ కుటుంబ సభ్యులు సోమవారం ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను వైఎస్సార్ సీపీ మండల సీనియర్ నాయకుడు అంబాల చినవెంకటరెడ్డి ప్రారంభించగా పోటీల్లో బాపట్ల జిల్లా బల్లికురవ ఎడ్లజత ప్రథమస్థానంలో నిలిచింది. పోటీలో మొత్తం 5 జతల ఎడ్లు పాల్గొనగా బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామి ఎడ్లజత పందెపురాయిని నిర్దేశిత సమయంలో 1589 అడుగులు లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ప్రకాశంజిల్లా టంగుటూరు గ్రామానికి చెందిన మక్కెన కోటేశ్వరరావు ఎడ్లజత 1551.3 అడుగులతో ద్వితీయ స్థానం, గిద్దలూరు మండలం కొండపేటకు చెందిన మీనిగ కాశయ్య ఎడ్లజత 1157 అడుగులు లాగి తృతీయ స్థానంలో నిలిచారు. బల్లికురవ పావులూరి వీరాస్వామికి చెందిన మరో జత 1023 అడుగుల లాగి నాల్గవ స్థానం, నంద్యాల జిల్లా బేతంచెర్లకు చెందిన మేకల వెంకట్రాముడు ఎడ్లజత 927 అడుగులు లాగి ఐదో స్థానంలో నిలిచారు. పోటీల్లో విజేతలకు బహుమతులు వరుసగా ప్రథమ రూ.50 వేలు, ద్వితీయ రూ.40 వేలు, తృతీయ రూ.30 వేలు, 4, 5 స్థానాల్లో నిలిచిన వారికి ప్రోత్సాహకంగా చెరో రూ.5 వేలను నారా కుటుంబసభ్యులు నారా పెద్ద సిద్దారెడ్డి, చినసిద్దారెడ్డి, బాలసిద్దారెడ్డి, సిద్దారెడ్డి అందజేశారు.

సర్వీసు ఓట్ల పరిశీలన



సర్వీసు ఓట్లు పరిశీలిస్తున్న పార్లమెంట్ నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్ ప్రత్యేక అధికారి ఝాన్సీ, రాజకీయ పార్టీల ప్రతినిధులు

ఒంగోలు అర్బన్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో దేశ వ్యాప్తంగా జిల్లాకు సంబంధించిన సర్వీసు ఓటర్లు ఉన్నారు. వారికి పోస్టల్ బ్యాలెట్‌లు రిజిస్టర్ పోస్టు ద్వారా జిల్లాకు చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం పార్లమెంట్ నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్ ప్రత్యేక అధికారి కే ఝాన్సీ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల పోటీలో ఉన్న పలువురు స్వతంత్ర అభ్యర్థుల సమక్షంలో సర్వీసు ఓట్లకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్‌లు పరిశీలించారు. రిజిస్టర్ పోస్ట్ ద్వారా వచ్చిన సర్వీస్ ఓట్లను లెక్కించి బాక్సులో వేశారు. ఈ ప్రక్రియ జూన్ 3వ తేదీ వరకు పోస్టు ద్వారా వచ్చిన సర్వీసు ఓట్లను పరిశీలించి భద్రపరుస్తారు. జిల్లాకు సంబంధించి ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌లో మొత్తం 6693 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. సోమవారం వరకు జిల్లాకు వెయ్యి ఓట్లు పోస్ట్ ద్వారా అందాయి. దీనిలో వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రసూల్, రాజశేఖర్. కాలేషా, రాయపాటి జగదీష్, కొండారెడ్డి, యోహాన్, రామాంజనేయులు, శ్రీకాంత్, మణి, రాంబాబు, సూర్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొగాకు గరిష్ట ధర కేజీ రూ.310


వేలం నిర్వహిస్తున్న సునీల్ కుమార్

కొండపి(సింగరాయకొండ): స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో అత్యధిక ధర కేజీ రూ.310 పలికింది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు నిర్వహించిన వేలంలో ఇదే అత్యధిక ధర అని నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ వెల్లడించారు. ఎస్.ఎస్ కండ్రిక, పెట్లూరు, వర్ధినేనివారిపాలెం, జగ్గరాజుపాలెం గ్రామాల రైతులు 908 బేళ్లను వేలానికి ఉంచగా 850 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 58 బేళ్లను తిరస్కరించారు. కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.252.06గా నమోదైంది. వేలంలో 20 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ మూల్యాంకనం

ఒంగోలు: ఆచార్య నాగార్జున యూనివర్శిటీ డిగ్రీ 4, 5వ సెమిస్టర్ల మూల్యాంకనం స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్, మూల్యాంకనం క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ డి.కళ్యాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ అన్ని సబ్జెక్టులు, బీఏ ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, బీకాం అన్ని సబ్జెక్టుల మూల్యాంకనం చేపడుతున్నట్లు వివరించారు. ఉదయం 10 గంటలకు మూల్యాంకనం ప్రారంభం అవుతుందని, ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాల అధ్యాపకులు యూనివర్శిటీ అపాయింట్‌మెంట్ ఐడీ కార్డు, పర్సనల్ ప్రొఫైల్, కాలేజీ రిలీవింగ్ ఆర్డర్ తీసుకుని హాజరుకావాలని సూచించారు.

పేట రౌడీలపై ఖాకీ ప్రేమ!

- ఎన్నికల రోజున పల్నాడును తలపించేలా దర్శిలో ఘర్షణలు
- కేసుల నమోదులో పోలీసుల ఉదాసీనతపై విమర్శలు
- శామంతపూడిలో పోలీసుల కళ్లెదుటే బూత్ నుంచి ఓటర్లను తరిమినా నో కేస్
- రచ్చ చేసిన నరసరావుపేట రౌడీలను వదిలేసి స్థానికులపై కేసులు?
- ఘర్షణకు దిగిన వీడియోలు పక్కా ఆధారాలుగా ఉన్నా పోలీసుల వెనకడుగు



దర్శిలో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం పోలింగ్ బూత్ ముందు టీడీపీ రౌడీలను చెదరగొడుతున్న పోలీసులు

దర్శి: సార్వత్రిక ఎన్నికల వేళ దర్శి నియోజకవర్గంలో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరించిన టీడీపీ నేతలు, వారి అనుచరులపై పోలీసులు ఉదాసీన వైఖరి అవలంబించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పల్నాడు ప్రాంతంలో ఘర్షణలను తలపించేలా దర్శిలో చోటుచేసుకున్న వరుస ఘటనలకు కారుకులైన టీడీపీ రౌడీ మూకలపై కేసులు నమోదు చేసేందుకు పోలీసులు వెనకడుగు వేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. నియోజకవర్గ కేంద్రమైన దర్శితోపాటు దేవవరం, బొట్లపాలెం, వెంకటాపురం, శామంతపూడి గ్రామాల్లో టీడీపీ నాయకులు చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. అన్ని గొడవల్లో నరసరావుపేటకు చెందిన వ్యక్తులు దాడులకు తెగబడినా వారిపై ఒక్క కేసూ నమోదు చేయకపోవడంతో పోలీసుల తీరుపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసుల్లో నిందితులుగా స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలనే పేర్కొన్న పోలీసులు.. నరసరావుపేట రౌడీలను మాత్రం ఎందుకు వదిలేశారన్నది పెద్ద ప్రశ్నగా మిగిలింది.

గొడవల నియంత్రణలో విఫలం

దర్శి నియోజకవర్గంలో పోలింగ్ రోజున గొడవలు సృష్టించేందుకు టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి కుట్ర పన్నారని, అందుకోసం నరసరావుపేట నుంచి 150 మంది కొత్త వ్యక్తులను రప్పించారని వైఎస్సార్ సీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించి చెప్పారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందు ఇదే విషయాన్ని పోలీసు అధికారులకు వివరించి, కొత్త వ్యక్తులను నియోజకవర్గం నుంచి పంపేయాలని కోరారు. అయినా ఘర్షణలను కట్టడి చేయడంలో పోలీసులు, ఎన్నికల అధికారులు విఫలమయ్యారు. టీడీపీ అభ్యర్థి సామాజికవర్గానికి చెందిన వారికి పోలీసులు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలు అందుకు బలం చేకూరుస్తున్నాయి.

ఆధారాలున్నా కేసులేవీ?

■ పోలింగ్ రోజున శామంతపూడి గ్రామంలో బూత్ వద్ద సాయంత్రం 6 గంటలకు క్యూలైన్‌లో ఉన్న సుమారు 80 మందికి పీఓ టోకెన్లు అందజేసి ఓటింగ్‌కు అవకాశం కల్పించారు. వారంతా దళితులనే చులకన భావంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అకస్మాత్తుగా గేట్లు వేసి క్యూలో ఉన్నవారిని బెదిరించి వెళ్లగొట్టారు. బూత్‌లో గందరగోళం సృష్టించి ఈవీఎంలు ఎత్తుకెళ్లాలని టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించిన ఏఎస్సై, ఓ కానిస్టేబుల్ పై అధికారులకు సమాచారం ఇవ్వడంతో అదనపు పోలీసు బలగాలు చేరుకున్నాయి. డీఎస్పీతోపాటు ఎస్సై సుమన్ అక్కడకు చేరుకుని గేట్లు వేసి అడ్డుగా నిలుచున్న వారిని చెదరగొట్టారు. టోకెన్లు తీసుకున్న వారిని ఓట్లు వేసుకోవచ్చని చెప్పారు. అయినా టీడీపీ నేతలకు భయపడి ఎస్సీలు పూర్తిగా ఓటింగ్‌లో పాల్గొనలేదు. ఇక్కడ రచ్చ చేసిన టీడీపీ నేతలపై ఒక్క కేసూ నమోదు చేయలేదు.

■ తూర్పు వెంకటాపురం గ్రామంలో పోలింగ్ బూత్‌లో పక్క గ్రామాలైన కొత్త వెంకటాపురం, ఎస్సీ కాలనీ వాసుల ఓట్లు ఉన్నాయి. ఈ రెండు కాలనీలు పూర్తిగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే. దీంతో వారిని ఓట్లు వేయకుండా అడ్డుకున్నారు. మీరెవరు ఇక్కడి రావడానికి అంటూ వారిపై టీడీపీ నేతలు దౌర్జన్యం చేశారు. తమను ఓట్లు వేయనీయడం లేదని పోలీసులకు ఫోన్ చేసిన గంట తరువాత ఎస్సై సుమన్ అక్కడకు చేరుకున్నారు. ఇక్కడ టీడీపీ నేతలు దౌర్జన్యం చేస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో హల్ చల్ చేస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలు బయటకు రావాలంటేనే భయాందోళనలు చెందుతున్నారు.

= దర్శిలో పోలీసులపై, పోలింగ్ బూత్‌పై రాళ్ల దాడి చేసిన, దేవవరంలో దాడులకు తెగబడిన నరసరావుపేట రౌడీల వీడియోలు స్పష్టంగా ఉన్నా ఇంత వరకు వారిపై చర్యలు తీసుకోకపోవడం పోలీసుల 'పచ్చ'పాతాన్ని తెలియజేస్తోందన్న ఆరోపలు గుప్పుమంటున్నాయి. ఎన్నికల బదిలీల్లో భాగంగా పల్నాడు ప్రాంతం నుంచి దర్శికి వచ్చిన పోలీసు అధికారి తీరుపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దర్శిలో చోటుచేసుకున్న వరుస దాడులపై సిట్ అధికారులతో దర్యాప్తు చేయించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ స్థానికుల నుంచి వినిపిస్తోంది.



- మార్కెట్‌లో కేజీ రూ.300కు చేరిన చికెన్ ధర
- దాణా రేట్లు పెరగటంతో తగ్గిన కోళ్ల ఉత్పత్తి
- ముట్టుకుంటే షాక్ కొట్టేలా మటన్ ధరలు

మంట పుట్టిస్తున్న మటన్..
కొండెక్కిన చికెన్!

పెద్దదోర్నాల: జిల్లాలో చికెన్ ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. నిన్నా మొన్నటి వరకు రూ.200 పలికిన చికెన్ ధర ఇప్పుడు ఏకంగా 300 రూపాయలకు చేరుకోవటంతో సామాన్యులు హడలిపోతున్నారు. కోళ్ల దాణా ధరలు పెరగడంతోపాటు, వేసవి తీవ్రత నేపథ్యంలో కోళ్ల ఉత్పత్తి తగ్గిపోవడంతో డిమాండ్ అధికమైందని, దీని వల్లే చికెన్ ధరలు భారీగా పెరిగాయని పౌల్ట్రీ వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం దాణా ధర కేజీ 70 రూపాయలు పలుకుతుండటంతో కోళ్ల ఉత్పత్తిపై అనాసక్తి చూపుతున్నారు. పెరిగిన చికెన్ ధరతో తమకు నష్టమే జరిగిందని, విక్రయాలు తగ్గాయని దుకాణదారులు వాపోతున్నారు. ముక్కలేనిదే ముద్ద దిగని కొందరు మాంసాహార ప్రియులు మాత్రం కేజీ చికెన్‌కు బదులు అర కేజీతో సర్దుకుంటున్నారు.

మటనా.. వొద్దుద్దులే..!

మాంసాహార ప్రియులకు మటన్ ధరలు కూడా మంట పుట్టిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం వరకు 700 రూపాయలు పలికిన మటన్ ధర ఇప్పుడు రూ.800 నుంచి రూ.900 పలుకుతుండటంతో కొనుగోలుదారులకే కాదు వ్యాపారులకు సైతం కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. మండీ మార్కెట్ ఏజెంట్లు జీవాల రేట్లను విపరీతంగా పెంచేయటంతో మేకపోతులు, పొట్టేళ్లను అధిక మొత్తం వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోందని, అందువల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా పెరిగిన ధరలు త్వరలోనే తగ్గుముఖం పట్టాలని మాంసాహార ప్రియులు కోరుకుంటున్నారు.

బైక్ అదుపుతప్పి మత్స్యకారుడు మృతి

చీరాల అర్బన్: ద్విచక్రవాహనం అదుపుతప్పి మత్స్యకారుడు మృతిచెందిన ఘటన సోమవారం వాడరేవు–ఊటుకూరి సుబ్బయ్యపాలెం రోడ్డులో చోటుచేసుకుంది. ఈపూరుపాలెం రూరల్ ఎస్సై ఎం.శివకుమార్ వివరాల మేరకు.. వేటపాలెం మండలం వూటుకూరి సుబ్బయ్యపాలేనికి చెందిన వి.బాలాజీ (45) మత్స్యకారుడు సోమవారం వ్యక్తిగత పనుల నిమిత్తం వాడరేవు వచ్చి తిరిగి గ్రామానికి పయనమయ్యాడు. ఈసమయంలో మార్గమధ్యంలో స్పీడ్ బ్రేకర్ వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలై అక్కకక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఈపూరుపాలెం రూరల్ ఎస్సై ఎం.శివకుమార్ తెలిపారు.

జాతీయ స్కిల్ కాంపిటీషన్‌లో
బింగినపల్లి విద్యార్థిని ప్రతిభ

కాస్ట్యూమ్స్ డిజైన్ విభాగంలో స్వర్ణ పతకం





బంగారుపతకం సాధించిన హర్షిత

సింగరాయకొండ(మర్రిపూడి): ప్రపంచ స్కిల్ కాంపిటీషన్‌లో భాగంగా ఈనెల 15వ తేదీ నుంచి 4 రోజులపాటు ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్కిల్ కాంపిటీషన్‌లో సింగరాయకొండ మండలం బింగినపల్లి గ్రామానికి చెందిన నూకసాని హర్షిత కాస్ట్యూమ్స్ డిజైన్ విభాగంలో బంగారు పతకం సాధించింది. హర్షిత బీహార్ రాష్ట్రంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కాలేజీలో మూడో సంవత్సరం పూర్తి చేసింది. స్కిల్ కాంపిటీషన్‌లో 60 విభాగాలకు దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన 900 మంది ప్రెజెంటేషన్లు ఇచ్చారు. కాస్ట్యూమ్స్ డిజైన్ విభాగంలో హర్షిత ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. హర్షిత తండ్రి గంగాధరరావు సీఎస్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. జాతీయ స్థాయి పోటీలో తన కూతురికి స్వర్ణ పతకం దక్కడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. హర్షితకు గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

పొలాల్లో వృద్ధుడి మృతదేహం లభ్యం

కనిగిరి రూరల్: ఈనెల 13న ఎన్నికల సమయంలో ఓటు వేసేందుకు ఇంట్లో నుంచి బయటకు వచ్చిన మండలంలోని నారపరెడ్డిపల్లికి చెందిన వృద్ధుడు వై వజ్రయ్య (67) అప్పటి నుంచి కనిపించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే సోమవారం మాచవరం సమీపంలోని హెరిటేజ్ డెయిరీ ఎదురుగా ఉన్న పొలాల్లో వజ్రయ్య మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై టీ త్యాగరాజు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థులు భవిష్యత్‌లో గొప్పగా ఎదగాలి


బహుమతులు అందుకున్న విద్యార్థులు

- ప్రకాశం పంతులు మునిమనుమరాలు సుభాషిణి
- 'భారతీయ మహిళామణులు' పుస్తకావిష్కరణ
- 143 మంది విద్యార్థులకు బహుమతుల ప్రదానం

అద్దంకి: విద్యార్థులు బాగా చదవి భవిష్యత్‌లో గొప్పగా ఎదగాలని ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు మునిమనుమరాలు సుభాషిణి అన్నారు. ఆమె సోమవారం పట్టణంలో సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో వాసవీ నగర్‌లోని శ్రీనివాస కళ్యాణ మండపంలో నిర్వహించిన ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీనిలో భాగంగా బంగ్లా రోడ్‌లోని ప్రకాశం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకాశం మునిమనుమరాలుగా పుట్టడం నా అదృష్టమన్నారు. ఆయన చాలా గొప్ప సాహసవంతుడని చెప్పారు. సంకా సుబ్రహ్మణ్యం సౌజన్యంతో విద్యార్థుల కోసం 'భారతీయ మహిళామణులు' జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇందులో మహిళామణులు చరిత్రలతోపాటు సృజన కవుల కవితలను పొందుపరచారు. పదో తరగతిలో 550 మార్కులకు పైగా సాధించిన 143 మంది విద్యార్థులకు బహుమతులు, అత్యుత్తమ మార్కులు సాధించిన 31 మందికి నగదు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో ఊటుకూరి ఉమా అన్నపూర్ణ, వీరవల్లి సుబ్బారావు, డాక్టర్ యూ దేవపాలన, అన్నమనేని వెంకట్రావు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, ఇలపావులూరి శేషతల్పసాయి, షేక్ మహ్మద్ రఫీ, రోటరీ క్లబ్ సభ్యులు, ఊటూకూరి రామకోటేశ్వరరావు, సాహితీ మిత్రమండలి సభ్యులు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

ఆటో ప్రమాదంలో మరొకరు మృతి

- పోస్టుమార్టం అనంతరం రెండు మృతదేహాలు బంధువులకు అప్పగింత
- కనిగిరి 11వ వార్డులో విషాద ఛాయలు


మృతురాలు కస్తూరి(ఫైల్)

కనిగిరి రూరల్: పట్టణంలోని దేవాంగనగర్ సమీపంలో ఆటోను కారు ఢీకొట్టిన ప్రమాదంలో బత్తుల విష్ణు నారాయణ(57) మృతి చెందగా, కాశిరెడ్డి కాలనీకి చెందిన అమ్మనబ్రోలు కస్తూరి(28) ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి కన్నుమూసింది. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బత్తుల విష్ణు మృతదేహానికి కనిగిరిలో, కస్తూరి మృతదేహానికి ఒంగోలు జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

పదకొండో వార్డులో విషాద ఛాయలు

పట్టణంలోని పదకొండో వార్డు దేవాంగ నగర్, కాశిరెడ్డి కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను చూసి కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. మృతురాలు కస్తూరి(28)కి ఇద్దరు పిల్లలు. రోజువారీ కూలీ పని చేసుకుంటూ ఆమె జీవనం సాగిస్తోంది. కస్తూరి మృతదేహం వద్ద ఆమె తల్లి తిరుపతమ్మ, ఇద్దరు పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

నిలకడగా విశ్రాంతమ్మ ఆరోగ్య పరిస్థితి

వెలిగండ్ల: నెల్లూరు జిల్లా దామరమడుగు వద్ద ఆదివారం తెల్లవారుజామున కనిగిరి–చెన్నై ఆర్టీసీ బస్సు ఆగిఉన్న లారీని ఢీకొనడంతో వెలిగండ్ల మండలానికి చెందిన ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుల్లో కంకణంపాడుకు చెందిన వేమవరపు విశ్రాంతమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరు వైద్యశాలలో చేర్పించారు. ఆదివారం రాత్రి ఆమె కాలు, చేయి, నడుముకు వైద్యులు ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం విశ్రాంతమ్మ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని సమాచారం. మృతి చెందిన గన్నవరానికి చెందిన వేమవరపు మరియమ్మ, కంకణంపాడుకు చెందిన వేమవరపు డేవిడ్‌కు వారి స్వగ్రామాల్లో అంత్యక్రియలు నిర్వహించారు.

ఎండోమెంట్ చెరువులో టీడీపీ నేతల అక్రమ తవ్వకాలు


అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్న టీడీపీ నాయకులు

- వచ్చేది తమ ప్రభుత్వమే అంటూ అధికారులతో దురుసు ప్రవర్తన

జే.పంగులూరు: దేవదాయశాఖ భూముల్లో తెలుగుదేశం నాయకులు అక్రమంగా జరుగుతున్న మట్టి తవ్వకాలను అధికారులు అడ్డుకున్నారు. మండల పరిధిలోని చందలూరు గ్రామానికి చెందిన దేవదాయ, ధర్మదాయ శాఖ కింద గ్రామంలో ఊరచెరువు ఉంది. ఈఊరచెరువు దాదాపు 20 ఎకరాల మేర ఉంటుందని అధికారులు అధికారులు తెలిపారు. చెరువులోని మట్టిని గ్రామంలోని కొందరు టీడీపీ నాయకులు ఆదివారం అక్రమంగా మట్టి తవ్వకాలు చేశారు. ఈ విషయమై గ్రామంలో కొందరు అడ్డుకునే ప్రయత్నం చేయగా పంచాయతీ కింద మట్టి తీస్తున్నామన్నారు. రేపు రాష్ట్రంలో వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమే అని, మీకు దిక్కున్నోడి చెప్పుకో ? అని అధికారులను హెచ్చరించారు. ప్రస్తుతం ఈచెరువు పంచాయితీ పరిధిలో లేదని, దేవదాయ, ధర్మాదాయ శాఖపరిధిలో ఉందని తెలిపినా వారు పట్టిచుకోకుండా మట్టి తవ్వకాలు చేశారు. ఈవిషయం దేవదయా ధర్మదాయ అధికారులకు తెలిసి చెరువు మట్టిని ఎలా తవ్వుతారని గుమస్తాను పంపి హెచ్చరించిన పట్టించుకున్న దాఖలాలు లేవు. దీనితో చేసేది లేక ఎండోమెంట్ ఈవో శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్రమ మట్టి తవ్వకాలను ఆపించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజల్లో ధైర్యం నింపేందుకే మాక్ డ్రిల్

- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు


ప్రజలకు సూచనలిస్తున్న డీఎస్పీ రామరాజు

కనిగిరి రూరల్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, కనిగిరి డీఎస్పీ ఆర్ రామరాజు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం స్థానిక పామూరు బస్టాండ్(చర్చి సెంటర్)లో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆర్ రామరాజు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, హింసాత్మక చర్యలకు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. ప్రజల్లో ధైర్యం కల్పించేందుకే మాక్ డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు.


మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

మాక్ డ్రిల్.. ప్రజలు హడల్!

పట్టణంలో పోలీసులు ఒక్కసారిగా మాక్ డ్రిల్ చేపట్టడంతో ఏం జరుగుతోందో అర్థం కాక ప్రజలు కాసేపు హడలెత్తారు. ఒక్కసారిగా పోలీసులు లాఠీలతో ప్రజలపైకి దూసుకురావడం, గాలిలో కాల్పులు జరిపి, వాటర్ కెనాన్లను ప్రయోగించడం, మంటలు ఆర్పడం తదిదర చర్యలను మాక్ డ్రిల్‌లో భాగంగా చేపట్టారు. కార్యక్రమంలో కనిగిరి, పామూరు సీఐలు దాసరి వెంకటేశ్వరరావు, రామ్ నాయక్, ఎస్సైలు త్యాగరాజు, శివనాగరాజు, రామకృష్ణ, పోలీస్ సిబ్బంది, ఫైర్ సిబ్బంది, 108 సిబ్బంది పాల్గొన్నారు.